• కష్టమంతా నేలపాలు



భూపాలపల్లి జిల్లా నగరంపల్లిలో నీట మునిగిన వరిపంటను చూపుతున్న మహిళా రైతు

• తడి తండ్లాట



శనివారం కురిసిన అకాల వర్షానికి సంగారెడ్డి శివారులోని చింతలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తడిసి రంగు మారిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

• ధాన్యం దిగులు



సంగారెడ్డి జిల్లాలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతు

• వడ్లు తెస్తే మొలకలొచ్చె..



కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో ఆరబోసిన వడ్లకు వచ్చిన మొలకలు

• కల్లం కుప్పే నారుమడాయె



కామారెడ్డి జిల్లాలో ఆరబోసిన వడ్లకు వచ్చిన మొలకలు

# తడిసిన ధాన్యం.. రైతన్న ఆగమాగం

- వివిధ జిల్లాల్లో కురిసిన వర్షం
- కల్లాల్లో, కేంద్రాల్లో ధాన్యం వర్షార్పణం
- పిడుగుపాటుకు 15 గొర్రెలు మృతి
- ఉధృతంగా మోరంచ వాగు ప్రవాహం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 18 : అకాల వర్షానికి రైతులు ఆగమవుతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయింది. సంగారెడ్డి జిల్లాలోని పలుచోట్ల శనివారం మధ్యాహ్నం వాన దంచికొట్టింది. కొనుగోలు కేంద్రాలకు వడ్లను తీసుకొచ్చిన రైతులు వర్షానికి ఇబ్బందిపడ్డారు. వడ్లను కాపాడుకోనేందుకు పట్టాల కోసం ఉరుకులు, పరుగులు పెట్టారు. అక్కడక్కడా రోడ్లపై వడ్లు ఆరబోసిన రైతులు ఆగమయ్యారు. నల్లగొండ జిల్లాలోని కట్టంగూర్ మండలంలో 65.5 మిల్లీమీటర్లు, మిర్యాలగూడలో 26.3 మిల్లీ మీటర్లు, దామరచర్లలో 17.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిర్యాలగూడ మండలంలోని జేత్యాతండాలో పిడుగు పడటంతో మాలోతు తావుర్యాకు చెందిన 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. తావుర్యాకు గాయాలు కాగా దవాఖానకు తరలించారు. వేములపల్లి మండలం ఆమనగల్లులో పిడుగు పడగా ఒకరికి గాయాలయ్యాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమల అమ్రాబాద్, జడ్చర్ల, భూత్పూరులో భారీగా, నాగర్‌కర్నూల్, గద్వాల, రాజాపూర్, తాడూరులో ఓ మోస్తరు వర్షం కురిసింది. జడ్చర్లలో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మురుగు కాల్వలు నిండి పారడంతో పలు కాలనీల్లోకి నీరు వచ్చి చేరింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గుణపురం మండలంలోని సీతారాంపురం, వెల్తుర్లపల్లి గ్రామాల మధ్యలోని మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వాగు పరిసర ప్రాంతాల్లోని వరి పంట పొలాలు నీట మునిగాయి. నేలవాలిన వరిపంట చేతికందే దశలో నీటిలోనే మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో 20 రోజుల్లో కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని విక్రయించే సమయంలో వర్షాలు తమ పాలిట శాపంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గణపురం మండల కేంద్రంతోపాటు కొండాపూర్, ధర్మారావుపేట, నగరంపల్లి, చెల్పూర్, బుద్ధారం, మైలారంలో పంట నీట మునగడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రం శివారులో మోరంచవాగు వరద నీటిలో మునిగిన వరి పొలం

## రైతులకు అండగా నిలుద్దాం

**చివరి గింజ వరకు కొనేలా పోరాడుదాం • మాజీ మంత్రి హరీశ్‌రావు**

**టెలికాన్ఫరెన్స్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపు**



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 18 : రైతులకు కష్టకాలంలో అండగా నిలువాలని,చివరి గింజా కొనే వరకు రైతుల పక్షాన పోరాడుదామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన సిద్దిపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు, బీఆర్‌ఎస్ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాతలను ఆగం చేస్తూ అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల పక్షాన పోరాటం చేయాలని సూచించారు. రోజుకోమాట మారుస్తూ మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టాలని కోరారు. వడ్లకు కాంగ్రెస్ ఇస్తానన్న రూ.500 బోనస్‌పై రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా నిలువాలని సూచించారు. రోజూ పొద్దున, సాయంత్రం కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లాలని, అక్కడి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకోవాలని అన్నారు. మిల్లర్లు, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులను సమన్వయం చేస్తూ వడ్లు కోనేలా చూడాలని కోరారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కొనుగోలు విషయంలో ఎక్కడ ఇబ్బంది వచ్చినా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.



మెదక్ జిల్లా కొల్చారం మండలం దుంపలకుంటలో ధాన్యం బస్తాలతో రాస్తారోకో చేస్తున్న రైతులు



జగిత్యాల జిల్లా నర్సింహులపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు

## తడిసిన వడ్లను కొంటాం: మంత్రి సీతక్క



ములుగు రూరల్, మే 18 : కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించే క్రమంలో తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినడంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసినట్టు పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే కొంటామని ప్రకటించారు. ఇక నుంచి రైతుల పంటకు రాష్ట్ర ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు. జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి

- రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి
- ధాన్యం బస్తాలను తరలించాలి
- జిల్లాల్లో రైతన్నల ఆందోళనలు
- మెదక్-సంగారెడ్డి రహదారిపై ధాన్యం బస్తాలతో రైతుల రాస్తారోకో



ములుగు జిల్లా జంగాలపల్లిలో పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములును నిలదీస్తున్న రైతులు

ములుగు, (నమస్తే తెలంగాణ)/ సారంగాపూర్/చిలిపిచెడ్(కొల్చారం)/రాజాపేట, మే18: కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం పలు జిల్లాల్లో అన్నదాతలు ఆందోళనలు చేపట్టారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలని, ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను వేడుకున్నారు. ఇందులో భాగంగా.. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి ప్రధాన రహదారిపై రైతులు నిరసన తెలిపారు. రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ నిర్వహించిన ధర్నాలో కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ ఎంపీపీ కొల్ముల రమణ మాట్లాడుతూ.. అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, కేంద్రాల్లో తడిసిన ధాన్యంలో కోతలు విధించకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రైతుబంధు సమితి మండల మాజీ సభ్యులు మెరుగు రాజేశం, ఎంపీటీసీ ఎడ్ల సృజన సుశిన్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శీలం రమేశ్, మాజీ సర్పంచ్ శీలం రవి, తాడుక మల్లేశం పాల్గొన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం దుంపలకుంట గ్రామ రైతులు తూకం వేసిన వరి ధాన్యం తరలించడం లేదని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించడంలో జాప్యం, సన్నరకం ధాన్యం తూకం వేయకపోవడాన్ని నిరసిస్తూ ఎనగండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దుంపకుంట గ్రామంలో ధాన్యం బస్తాలతో మెదక్-సంగారెడ్డి రహదారిపై రైతులు పెద్ద ఎత్తున రాస్తారోకోకు దిగారు. రైతులు రోడ్డు ఎక్కడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. కొల్చారం ఎస్సై మహ్మద్‌గౌస్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించే వరకు కదిలేది లేదని రైతులు భీష్మించుకొని కూర్చున్నారు. అనంతరం తహసీల్దార్ గఫార్‌మియా రైతుల వద్దకు చేరుకుని నర్సాపూర్ ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడించారు. తూకం వేసిన ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. నెల గడుస్తున్నా ఐకేపీ సెంటర్‌లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వానకు తడిసి మొలకెత్తిందని, ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా పాముకుంట రైతులు రాజాపేట మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు.

### పీఏసీఎస్ చైర్మన్ నిలదీత

లారీ యజమానులు, రైస్ మిల్లర్లు కలిసి ధాన్యాన్ని తరలించకుండా, లారీలు రాకుండా చేయడంతో ములుగు జిల్లా ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములును నిలదీశారు. తమ వడ్లను 20 రోజులుగా ఎందుకు కొనుగోలు చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చిన లారీలను ఖాళీగా పంపించడమేంటని మండిపడ్డారు. గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షానికి రైతుల ధాన్యం తడిసిముద్దయిందని, కాంటాలు వేసిన వడ్ల బస్తాలు సైతం తడిసిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సివిల్ సప్లయ్ డీఎం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కాంటాలు వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించినా.. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పట్టించుకోలేదని వాపోయారు.

## కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

కామారెడ్డి రూరల్, మే 18: కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రైతులు 20 రోజులుగా ధాన్యం కుప్పలకు కాపలా కాస్తున్నా.. కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకురాలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 20 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండటంతో కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని వాపోయారు.



## మరో 3రోజులు వర్షాలే

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ) : దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి కొమరిన్ ప్రాంతం వరకు కొనసాగిన ఆవర్తనం శనివారం తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ కర్ణాటకకు చేరింది. ఈ ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం రాయలసీమ, ఉత్తర తమిళనాడు ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తులో కేంద్రీకృతమైన చక్రవాతపు ఆవర్తనం శనివారం బలహీనపడింది. దీంతో రాగల మూడురోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదివారం కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులులతో కూడిన వర్షం కురుస్తుందని, గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది.